

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 58 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: దసరా సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 21, 22 తేదీల్లో సికింద్రాబాద్ -తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 21వ తేదీ రాత్రి 10.05 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ (07489) నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరిగి ఈ రైలు 22వ తేదీ ఆదివారం సాయంత్రం 4.35 గంటలకుతిరుపతి జంక్షన్ (07490) నుంచి బయలుదేరి సికింద్రాబాద్‌కు ఉదయం 4.50 గంటలకు చేరుతుంది. ఈ రైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణుగుంట మీదుగా తిరుపతి చేరుతుంది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు



తనకల్లు/అనంతపురం మెడికల్: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకొని తల్లిని చేశాడు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సదరు బాలిక మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పూర్తి చేసింది. ఆ సమయంలో అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రెడ్డి నాగయ్య మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకున్నాడు. కాగా.. బాలిక పదో తరగతి పూర్తి చేసి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరినప్పటికీ కళాశాలకు సక్రమంగా వెళ్లలేదు. ఈ నెల 14న కడుపు నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పింది. వారు తనకల్లు 30 పడకల ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు ఇది కడుపు నొప్పి కాదని, పురిటి నొప్పులని చెప్పి అత్యవసరంగా కాన్పు చేశారు. మగబిడ్డను ప్రసవించింది. అయితే ప్రసవం అయ్యాక మావి బయటకు రాకపోవడం, రక్తస్రావం తదితర సమస్యలు తలెత్తడంతో తనకల్లు ఆస్పత్రి వైద్యులు అదే రోజు కదిరి ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి వైద్యులు మావి తీసి ఓ యూనిట్ రక్తాన్ని అందించారు. రక్తహీనత ఉండడంతో అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రెఫర్ చేయగా, ఈ నెల 15న తెల్లవారుజామున 1.40 గంటలకు అక్కడ అడ్మిట్ చేశారు.

ఆధార్‌తో మైనర్‌గా గుర్తింపు..

ఆమెకు వివాహం అయ్యిందని, వయసు 18 ఏళ్లు అని కేసు షీటులో నమోదు చేయించారు. కానీ సర్వజనాస్పత్రి వైద్యులకు అనుమానం వచ్చి ఆధార్‌కార్డు తీసుకురావాలని తల్లిదండ్రులకు చెప్పారు. సోమవారం ఆధార్ కార్డు తెచ్చివ్వగా.. బాధితురాలి వయసు 16 ఏళ్లుగా నిర్ధారణ అయ్యింది. దీంతో అక్కడి వైద్యులు కదిరి డీఎస్పీ శ్రీలత, తనకల్లు ఎస్‌ఐ రాజశేఖర్‌కు సమాచారం అందజేశారు. పోలీసులు అనంతపురం వెళ్లి బాలికతో పాటు తల్లిదండ్రులను విచారించి వివరాలను సేకరించారు. వారి ఫిర్యాదు మేరకు తెలుగు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు.

పల్లెల్లోనూ.. ఈ-బైక్

ఎలక్ట్రిక్ బైక్...గతంలో మెట్రో సిటీలో చూసే వాళ్లం. ఇప్పుడు పల్లెల్లోనూ యువత రయ్.. రయ్ మంటూ ఈ-బైక్‌లపై దూసుకెళ్తోంది. పర్యావరణానికీ మేలు చేసే ఈ-బైక్‌ల విక్రయాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో మండల కేంద్రాల్లోనూ షోరూంలు వెలిశాయి. పెట్రోలు బైక్‌లతో పోలిస్తే ధర తక్కువగా ఉండటం.. నిర్వహణ పెద్దగా లేకపోవడంతో జనమంతా ఇప్పుడు ఈ-బైక్ కొనుగోళ్లకే మొగ్గుచూపుతున్నారు.



ఇతని పేరు బాలాజీ. ధర్మవరంలో వాటర్ డిస్ట్రిబ్యూటర్. వ్యాపార నిమిత్తం ప్రతి నెలా 1,300 కిలోమీటర్లు తిరుగుతుంటాడు. పెట్రోల్‌కు నెలకు రూ.3 వేలు వరకు ఖర్చయ్యేది. దీంతో ఇటీవల ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేశాడు. ప్రస్తుతం రూ.200 ఖర్చుతో నెలంతా ఈ- బైక్‌పై తిరుగుతున్నట్లు సంతోషంగా చెబుతున్నాడు. బైక్ నిర్వహణ ఖర్చులు కూడా లేవంటున్నాడు.

- జిల్లాలో పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు
- పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ పరుగులు
- నానాటికీ పెరుగుతున్న ఇంధన ధరలే కారణం
- పెట్రోల్‌తో పోల్చితే పది శాతం ఖర్చుతో నడుస్తున్న వైనం
- పాత వాహనాలను రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఈ-వాహనంగా మార్పు

సాక్షి, పుట్టపర్తి

పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేస్తున్నారు. ఫలితంగా కాలుష్య రహిత ఈ-వాహనాల వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ప్రముఖ నగరాల నుంచి పట్టణాలు, పల్లెల వరకు ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చేశాయి.



హిందూపురంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఈ-వెహికల్స్

భారీగా పెరిగిన వాహనాలు..

జిల్లాలో ఇటీవల కాలంలో ఈ- బైక్‌లను విపరీతంగా కొనుగోలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు విద్యుత్ ద్విచక్ర వాహనాలు వినియోగించేలా ఆంధ్రప్రదేశ్ నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ప్రోత్సహిస్తోంది. మరోవైపు సాధారణ ప్రజలు సైతం విద్యుత్ వాహనాల వాడకంలో ముందంజలో ఉన్నారు. జిల్లాలో గతేడాది వందల సంఖ్యలో ఉన్న ఈ-వాహనాలు ప్రస్తుతం వేల సంఖ్యకు చేరాయి. పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, కదిరి పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా ఎలక్ట్రిక్ వాహనాలు కనిపిస్తున్నాయి. వాహన వినియోగదారులకు అనుగుణంగా అక్కడక్కడా చార్జింగ్ స్టేషన్లు కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.



ఇంధన ఖర్చు తక్కువే..

సాధారణ ద్విచక్ర వాహనానికి కిలోమీటరు ప్రయాణానికి రూ.2.15 పెట్రోల్‌కు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. అదే ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనం కిలోమీటర్ నడవాలంటే 15 పైసలు సరిపోతుందని చెబుతున్నారు. ద్విచక్రవాహనం నెలకు 1,500 కిలోమీటర్లు తిరిగే వారికి రూ.3,400 ఖర్చు అవుతుండగా, ఈ-వాహనం అయితే రెండు కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఇందు కోసం రూ.225 ఖర్చు అవుతుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే చాలా మంది ఈ-వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. పెట్రోల్ వాడకంలో ఆదాను కంతులుగా కడితే ఎలక్ట్రిక్ బైక్ మూడేళ్లలో సొంతం చేసుకోవచ్చని పలువురు చెబుతున్నారు. పెట్రోల్ ఖర్చులతోనే కరెంటు బైక్ వస్తుందంటున్నారు.

పాత వాహనాలకూ రెట్రో ఫిట్టింగ్..

ఇంధన ఖర్చులు భారీగా ఆదా అవుతుండటంతో మెట్రో నగరాల్లోని వాహనదారులు తమ పాత వాహనాలను సైతం రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకుంటున్నారు. అయితే ఇలాంటి అవకాశం జిల్లా వాసులకు ఇంకా అందుబాటులోకి రాలేదు. పెట్రోల్ ఇంజిన్ స్థానంలో బ్యాటరీ అమర్చాలంటే రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. అయితే పూణెలోని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధ్రువీకరణ పత్రం ఉన్న కిట్‌లనే రెట్రో ఫిట్టింగ్‌కు వాడాలనే నిబంధన ఉంది. ఎంవీఐ తనిఖీ అనంతరం బండి ఆర్‌సీలో కూడా మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా షోరూంలు..

హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి పట్టణాల్లో ఈ-వాహనాల షోరూంలు వెలిశాయి. ఇటీవల ఎలక్ట్రిక్ బైక్‌ల అమ్మకాలు పుంజుకున్నట్లు పుట్టపర్తిలోని షోరూం నిర్వాహకుడు తెలిపారు. ప్రస్తుతం పెట్రోల్ బైక్ కొనాలంటే రూ.లక్ష దాకా వెచ్చించాల్సి వస్తోందని, అదే ఎలక్ట్రిక్ బైక్ అయితే రూ.55 వేలకే అందుబాటులో ఉంటోందన్నారు.

కూర్మావతార... ఖాద్రీశా



కూర్మావతారంలో దర్శనమిచ్చిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి

కదిరి టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. రోజుకో అలంకారంలో ఆ శక్తిస్వరూపిణి దర్శనమిస్తుండగా... అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల్లో రెండోరోజైన సోమవారం ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి కూర్మావతార అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమహావిష్ణువు దశావతారాల్లోని రెండో అవతారం కూర్మావతారంలో కనిపించిన వసంతవల్లభుడిని దర్శించుకుని జనం తరించారు. ఇక కదిరిలోని చౌడేశ్వరిదేవి భ్రమరాంబగా, వాసవీ కన్యకా పరమేశ్వరి మహాలక్ష్మిగా, మరకత మహాలక్ష్మి అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి భక్తులు పాల్గొన్నారు.



లలితాదేవి అలంకారంలో మరకత అమ్మవారు

టీడీపీ కు(టి)ల రాజకీయం

- ఈనెల 4న కనగానపల్లిలో పరిటాల సునీత, శ్రీరామ్, బీకే పార్థసారథి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ర్యాలీకి సిద్ధమయ్యారు. కానీ శాంతిభద్రతల నేపథ్యంలో పోలీసులు అనుమతించలేదు. దీంతో టీడీపీ నేతలు కుల రాజకీయం చేశారు. ఓ బలమైన బీసీ సామాజిక వర్గాన్ని ముందు నిలిపి ర్యాలీకి సిద్ధమయ్యారు. అనుమతులు లేకపోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. మొత్తం 119 మందిపై కేసు నమోదు చేశారు. 'పరిటాల'కుటుంబ స్వార్థ రాజకీయాల కోసం బీసీలు కూడా ఇలా కేసుల్లో ఇరుక్కున్నారు.



- ఈనెల 9వ తేదీన హిందూపురంలో టీడీపీ నేతలు ర్యాలీ తలపెట్టారు. అయితే ట్రాఫిక్ సమస్యతో పాటు శాంతి భద్రతలు దెబ్బతింటాయని భావించిన పోలీసులు అడ్డుచెప్పారు. కానీ వినకుండా రాద్ధాంతం చేశారు. ఈ క్రమంలో టీడీపీ నేత అంబికా లక్ష్మీనారాయణను వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. దీన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలనుకున్న టీడీపీ నేతలు బీసీ వర్గాలకు చెందిన కార్యకర్తలను రెచ్చగొట్టారు. పచ్చ నేతల కుటిల రాజకీయం తెలియని టీడీపీ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముట్టడికి వెళ్లి కేసుల్లో ఇరుక్కున్నారు.

- ఉనికి కోసం కులాలను రెచ్చగొడుతున్న 'తమ్ముళ్లు'
- ధర్నాలు, నిరసనలకు తరలి రావాలని డిమాండ్
- పార్టీలో పే..ద్ద పోస్టులిస్తామంటూ మభ్యపెడుతున్న వైనం
- కేసులు మోసుకుంటే మరిన్ని అవకాశాలంటూ చీప్ ట్రిక్స్

సాక్షి, పుట్టపర్తి

చంద్రబాబు అరెస్టుతో టీడీపీ నేతలంతా నీరుగారిపోయారు. పార్టీ పనైపోయిందంటూ అంతర్గతంగా కుమిలిపోతున్నారు. నడిపించే నాయకుడు లేక తలోదారి చూసుకుంటున్నారు. ఈ తరుణంలో కొందరు టీడీపీ నేతలు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలను రెచ్చగొట్టి ధర్నాలు, నిరసనలు చేయిస్తున్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం అమాయక ప్రజలను కేసుల్లో ఇరికిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో జిల్లాలో నాలుగైదు చోట్ల వెలుగు చూశాయి. ధర్నాల్లో పాల్గొంటే పార్టీలో పదవులు ఇస్తామని ఆఫర్లు ప్రకటిస్తున్నారు. కేసులు మోసుకుంటే మరిన్ని అవకాశాలు వస్తాయని ఆశచూపి ప్రేరేపిస్తున్నారు. ఉనికి చాటుకునేందుకు కు(టి)ల రాజకీయాలు చేస్తున్నారు.

పదవుల పేరుతో ఆశచూపి..

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఇటీవల టీడీపీ నేతలు ధర్నాలు, దీక్షలు చేపట్టారు. అయితే సొంత పార్టీ కార్యకర్తల నుంచి కూడా స్పందన కరువైంది. దీంతో 'ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డారు. ధర్నాలు చేయండి.. దీక్షల్లో పాల్గొనండి.. పోలీసులపై తిరగబడండి...రానున్న రోజుల్లో పే...ద్ద పదవులు వస్తాయి. ముందుకు రండి'అని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కేడర్‌ను రెచ్చగొడుతున్నారు. కానీ ఇన్నాళ్లు అంతా తామే...అన్నీ తామే అంటూ పెత్తనం చేసిన నేతలు ఇప్పుడు ఇలా 'బాబ్బాబు' అంటూ అడుక్కుంటున్నా... కేడర్ మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదు. మీ పార్టీలో పోస్టులొద్దు... మీరూ వద్దూ అంటూ ముఖం మీదే చెప్పేస్తున్నారు. దీంతో టీడీపీ నేతలు కొందరికి డబ్బు, మద్యం ఎరగా వేసి ప్రేరేపిస్తున్నారు. పార్టీ కమిటీలోనూ ఉన్నత పదవులిస్తామంటూ చిన్నస్థాయి కార్యకర్తలకు ఆఫర్లు ఇస్తున్నారు.

సీటు గ్యారెంటీ లేక...

జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు ఉంటుందని ప్రకటించారు. టీడీపీ సీనియర్ నేతలంతా పక్కన విధేయులుగా నిలబడగా రాజమండ్రి సెంట్రల్ జైలు ఎదుట పవన్ చేసిన ఈ ప్రకటనను 'తమ్ముళ్లు' జీర్ణించుకోలేకపోతున్నారు. పొత్తు గురించి తమ నాయకుడు చెప్పాలి గానీ, ఈ సినిమా యాక్టర్ చెప్పేదేంటంటూ రగిలిపోతున్నారు. మరోవైపు ఇక టీడీపీని కూడా తామే నడిపిస్తామని జనసైనికులు చెప్పుకుంటున్నారు. జిల్లాలోని పలు అసెంబ్లీ స్థానాలు కూడా పొత్తులో తమకే వస్తాయంటూ ప్రచారం మొదలుపెట్టారు. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న టీడీపీ నేతలు పోటీ చేసేందుకు జంకుతున్నారు. పొత్తులో నిజంగా జనసేనకు టికెట్ ఇస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. అందువల్లే చాలా మంది టీడీపీ వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో కేడర్‌ను కాపాడుకునే క్రమంలో టీడీపీ ముఖ్య నేతలు కులాల వారీగా పదవులు కట్టబెడతామని ఆశ చూపుతూ బీసీ, ఎస్సీ కులాల వారితో హడావుడి చేయిస్తున్నారు. పోలీసులు రంగప్రవేశం చేస్తే మాత్రం ఆ ఛాయల్లో కనిపించడం లేదు. ఫలితంగా టీడీపీ నేతల మాటలు నమ్మి రోడ్డెక్కిన బీసీ, బడుగు, బలహీన వర్గాలు మాత్రం కేసుల్లో ఇరుక్కుని జైళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి



దివ్యాంగుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- డిసెంబర్ నాటికి జిల్లాలో 22 వేల సామూహిక గృహ ప్రవేశాలు
- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' కార్యక్రమాల్లో అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 180 అర్జీలు అందగా, ప్రతి అర్జీదారునితో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. కొన్నింటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీలు గడువులోపే పరిష్కరించాలని ఆదేశించారు.

జగనన్న కాలనీల్లో వసతులు కల్పించండి..

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో తాగునీరు, ఇంటింటికీ కొళాయి కనెక్షన్, విద్యుత్ కనెక్షన్, సోక్ పిట్, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. 'స్పందన' కార్యక్రమం అనంతరం ఆయన జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మాణాల్లో ఉన్న గృహాలు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. జగనన్న లేఅవుట్లలో ప్రతి వారం పురోగతి కనిపించాలన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి జిల్లాలో 22 వేల ఇళ్లు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, హౌసింగ్, ఈ క్రాప్ నమోదు, నాడు-నేడు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల పురోగతి తెలుసుకుని తగు ఆదేశాలు ఇచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో మండల ప్రత్యేకాధికారులు తప్పకుండా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

- తలుపులలో విలేకరిగా చలామణి అవుతున్న సుధీర్ కుమార్ అనే వ్యక్తి సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తామని, అంధుడినైన తనవద్ద రూ.28 వేలు తీసుకుని సర్టిఫికెట్ ఇప్పించ లేదని తలుపుల మండలం నూతనకాల్వకు చెందిన మహమ్మద్ రఫీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, స్పందనలో సదరు సుధీర్‌కుమార్ అనే వ్యక్తిపై ఐదుగురు ఫిర్యాదు చేశారు.



ఆద్య కోసం అంతా ఒక్కటై: కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న హిందూపురం వాసులు

ఆద్యకు కన్నీటి నివాళి

- చిన్నారి ఆత్మశాంతికి కదిలివచ్చిన హిందూపురం వాసులు
- వేలాది మందితో కొవ్వొత్తుల ర్యాలీ
- ఆద్య ప్రాణాలు బలిగొన్న బైకర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్

హిందూపురం: ఓ బైక్ రైడర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయిన ఎనిమిదేళ్ల చిన్నారి కట్టా ఆద్యకు 'పురం' ఘన నివాళులర్పించింది. కుల, ప్రజా సంఘాల నాయకులతో పాటు రాజకీయ పార్టీ నేతలు, పురప్రముఖులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి చిన్నారి ఆద్య ఆత్మశాంతికి కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మూడురోజుల క్రితం స్థానిక పట్టుగూళ్ల మార్కెట్ సమీపంలో తల్లి చైత్ర, చిన్నారి ఆద్య ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మితిమీరిన అతివేగంగా వెనుకవైపు నుంచి వచ్చిన ఓ బైకర్ ఢీ కొనడంతో చిన్నారి కట్టా ఆద్య ప్రాణాలు కోల్పోగా, ఆమె తల్లి చైత్ర తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన హిందూపురం వాసులను కలచివేసింది. చిన్నారి ఆద్య ఆత్మకు శాంతి కలగాలని సోమవారం వేలాది మంది స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా గాంధీసర్కిల్, అంబేడ్కర్‌సర్కిల్ గుండా సద్భావన సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆద్య కోసం కలిసి సాగుదాం అంటూ దాదాపు 5 వేల మందికి పైగా బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి ఆద్య కుటుంబసభ్యులు మాట్లాడుతూ.. తమలా ఎవరికీ కడుపుకోత మిగలకూడదన్నారు. ఈ మేరకు పోలీసులు తగు చర్యలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, ఆద్య కుటుంబసభ్యులు

చిన్నారి ఆద్య ఆత్మకు శాంతి చేకూరాలి..

చిన్నారి ఆద్య ఆత్మకు శాంతి చేకూరాలని వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆద్య కుటుంబీకులతో కలిసి డీఎస్పీ కంజాక్షన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మధుమతి రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వెదురు.. ఆదాయ వనరు

- ప్రైవేటు ఉద్యోగాన్ని వీడి వ్యవసాయంలో రాణిస్తున్న యువకుడు
- బల్‌కోవ, బయోమాస్క్ రకాల వెదురు సాగుకు శ్రీకారం

రాయదుర్గం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సమకూర్చే వినూత్న పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో వెదురుకు ఉన్న ఆదరణ, గిరాకీని దృష్టిలో ఉంచుకుని గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన పాటిల్ వంశీకృష్ణారెడ్డి ప్రయోగాత్మక సాగుకు శ్రీకారం చుట్టారు. దేశంలో వినియోగిస్తున్న వెదురు ఉత్పత్తుల అవసరాలకు ఈశాన్య రాష్ట్రాల్లో పండిస్తున్న వెదురు సరిపోవడం లేదు. దీంతో విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్లో 20 అడుగుల పొడవున్న వెదురు బొంగు రూ.100 నుంచి రూ.200 వరకూ ధర పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వం సైతం నేషనల్ బ్యాంబూ మిషన్ ఏర్పాటు8 చేసి దేశ వ్యాప్తంగా వెదురు సాగును ప్రోత్సహిస్తోంది.

జిల్లాలో మొట్టమొదటగా గొల్లపల్లిలో..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొట్టమొదటిసారిగా గుమ్మఘట్ట మండలం గొల్లపల్లిలో 10 ఎకరాల్లో బల్‌కోవ, బయోమాస్క్ రకాలకు చెందిన వెదురు సాగులో ఉంది. గ్రామానికి చెందిన పాటిల్ వంశీకృష్ణారెడ్డి బళ్లారి జిల్లా తొరణగల్లులో ఉన్న జిందాల్ పరిశ్రమలో ఉద్యోగం చేసేవారు. నెలకు రూ.40 వేలు వేతనం అందేది. కరోనా కారణంగా పరిశ్రమ మూతపడడంతో విధిలేని స్థితిలో స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇంటి పట్టునే ఖాళీగా ఉండలేక వ్యవసాయంపై దృష్టి సారించారు. అందరిలా సాధారణ పంట కాకుండా వినూత్నంగా ఏదైనా సాగు చేయాలని భావించిన ఆయన.. కర్ణాటక ప్రాంతంలో విస్తరిస్తున్న వెదురు సాగుపై ఆసక్తి పెంచుకుని, ఆ ప్రాంత రైతులను కలసి అవగాహన పెంచుకున్నారు. అనంతరం తమిళనాడులోని హొసూరు ప్రాంతం నుంచి రూ.2 లక్షల వ్యయంతో 10 వేల వెదురు పిలకలు (బల్‌కోవ, బయోమాస్క్ రకం) కొనుగోలు చేసి, తనకున్న పది ఎకరాల్లో సాగు చేపట్టారు. మరో పది నెలల్లో పంట కోతకు రానుంది.



గొల్లపల్లి వద్ద సాగు చేసిన వెదురు పంట, బయోమాస్క్ వెదురు బొంగులను చూపుతున్న రైతు వంశీకృష్ణారెడ్డి

నేల ఆరోగ్యం బాగు



ఏడాదికి ఎకరా విస్తీర్ణంలో 4 టన్నుల ఆకు రాలుతుంది. ఇది సహజ ఎరువుగా మారి నేల ఆరోగ్యాన్ని పెంచుతుంది. ఒక్కొక్క వెదురు చెట్టు 50 వేల లీటర్ల నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం కలిగి ఉండడంతో భూగర్భజలాలూ పెరుగుతాయి. త్వరలో రైతు వంశీకృష్ణారెడ్డి పొలం వద్దనే వెదురు సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించబోతున్నాం. – **రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, అనంతపురం**

పెట్టుబడి తక్కువ...



ఎకరాకు 450 మొక్కలు నాటితే నాలుగేళ్ల తర్వాత 4 వేల బొంగులు చేతికి వస్తాయి. ఆ తర్వాత ఏటా పిలకలు పెరిగి బొంగుల సంఖ్య క్రమంగా వృద్ధి చెందుతాయి. మొదట్లో మొక్కల కొనుగోలు, రవాణా, నాటడం, వేసవిలో నీటితడులు అందించి కాపాడటానికి మాత్రమే ఖర్చుచేయాలి. పొలం చుట్టు కంచె, బిందు, సేద్య పరికరాలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు వస్తోంది. రెండో ఏడాది నుంచి పెట్టుబడులు, కూలీల ఖర్చులు ఉండవు. ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ అవసరం లేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పెద్దగా నష్టమూ ఉండదు. అంతర పంట సాగు ద్వారా అదనపు ఆదాయమూ ఉంటుంది. మరో 10 ఎకరాల్లో వెదురు సాగుకు నేలను సిద్ధం చేశా. ఈ పంట చూసి దాదాపు 20 మంది రైతులు సాగుకు సిద్ధమయ్యారు. – **పాటిల్ వంశీకృష్ణారెడ్డి, రైతు, గొల్లపల్లి**

క్లుప్తంగా

విద్యార్థికి అధికారుల అభినందన


విద్యార్థి రహీంను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్

పుట్టపర్తి అర్బన్: ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీలకు ఎంపికైన లేపాక్షి మండలం పులమతి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రహీంను సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికారులు అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రహీం ఆవిష్కరణకు ప్రథమ బహుమతి దక్కింది. దీంతో రహీంను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఈఓ మీనాక్షి తదితరులు సోమవారం రహీంను కలెక్టరేట్‌కు రప్పించుకుని అభినందించారు. జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ గిరిధర్, హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సెబ్ తనిఖీలు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో సెబ్ పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. పుట్టపర్తి సెబ్ స్టేషన్ పరిధిలోని కర్ణాటకనాగేపల్లి క్రాస్ వద్ద 48 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. గుడిబండ మండలంలో 35 టెట్రా ప్యాకెట్లు, పరిగి మండలంలో 54 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. ధర్మవరం పరిధిలోని అటవీ ప్రాంతంలో 60 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి చేయండి


ప్రొఫెసర్ అనితను సన్మానిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం: వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎస్కేయూ పాలకమండలి సభ్యురాలిగా నియమితులైన డాక్టర్ కే అనిత (అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ)ను వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు సోమవారం కోరారు. పాలకమండలిలో 50 శాతం మహిళలతో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కేటగిరీలకు 50 శాతం పైగా స్థానాలను కట్టబెట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఆమెను వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పి. హేమంత్ కుమార్, వాసు, శివ, పూర్ణ చంద్ర, అనిల్, కేశవ, నవీన్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.180 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం


మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

యాడికి: రాయలచెరువు గ్రామంలో చందన, యాడికి గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న రైల్వే గేట్‌ను తొలగించి, దాదాపు రూ.180 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు మంజూరైనట్లు రైల్వే ఈఈ ప్రసాద్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ రమణ, తహసీల్దార్ అలెగ్జాండర్ తెలిపారు. సోమవారం మండలంలోని రాయలచెరువులో ఉన్న రైల్వే గేట్లను రైల్వే, ఈఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై ఆరా తీశారు. రైల్వే డీఈ శ్రీధర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ నరసయ్య, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, వీఆర్వో కుమార్ పాల్గొన్నారు.

రూ.1,800 కోట్లకు చేరిన డీసీసీబీ టర్నోవర్

- అభినందనలు తెలిపిన చైర్‌పర్సన్ లిఖిత


కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరువగా డీసీసీబీ టర్నోవర్ చేరుకోవడంపై ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలాఖరుతో ముగిసిన ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి రూ.1,800 కోట్ల టర్నోవర్ సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ క్రమంలో సోమవారం స్థానిక డీసీసీబీ హాలులో 28 బ్రాంచి మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రగతి పథంలో నడుస్తున్న డీసీసీబీని ఇటీవల రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బలహీన బ్యాంకుల జాబితా నుంచి తొలగించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, నాబార్డు, ఆప్కాబ్ సహకారంతో డీసీసీబీ ఆర్థిక పురోగతి దిశగా పయనిస్తోందన్నారు. రెండో త్రైమాసికం ముగిసేసరికి రూ.1,800 కోట్ల మార్క్‌ను అధిగమించి డిసెంబర్ నెలాఖరుకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించే దిశగా పయనిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరిస్తున్న బ్యాంకు పాలకవర్గం, అధికారులు, బ్రాంచి మేనేజర్లను అభినందించారు. భవిష్యత్తులో వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఆధునిక బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సమావేశంలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎం రవికుమార్, నాబార్డు డీడీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

‘పోలీస్ స్పందన’కు 40 వినతులు


స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 40 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్య తీవ్రత తెలుసుకుని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు. కాగా, నెల రోజులుగా తన కుమార్తె కనిపించడం లేదని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదంటూ ఎస్పీ మాధవరెడ్డి ఎదుట హిందూపురానికి చెందిన మంజుల వాపోయింది. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో ఎస్పీకి ఆమె వినతి పత్రం అందజేసి మాట్లాడారు.

విలేకరినంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు


విలేకరిపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు గుంజుతున్న జనశక్తి రిపోర్టర్ సుధీర్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ మాధవరెడ్డికి కదిరి నియోజకవర్గం తలుపుల మండల ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కల్పిస్తానని, సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తానంటూ పలువురితో రూ.వేలకు వేలు డబ్బు వసూలు చేసుకున్నాడన్నారు. ఈ విషయం తెలిసి నిలదీస్తే ప్రజాప్రతినిధి అనే విషయాన్ని సైతం మరిచి బెదిరింపులకు దిగాడన్నారు. అంతేకాక రోజుకో పిచ్చి రాతలు రాస్తూ అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆరోపించారు. విలేకరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనుచరులు పలువురు పాల్గొన్నారు.

ఆహార సూచిలో అగ్రగామిగా ఉండాలి

- వీసీ ఆచార్య జింకా రంగజనార్దన

అనంతపురం: ఆహార సూచిలో మన దేశం అగ్రగామిగా ఉండేలా వినూత్న పరిశోధనలు సాగించాలని ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆచార్యులకు జేఎన్‌టీయూ(ఏ) వీసీ ఆచార్య జింకా రంగజనార్దన సూచించారు. జేఎన్‌టీయూ (ఏ)ఓటీపీఆర్‌ఐలో ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ‘ప్రపంచ ఆహార దినోత్సవం’ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆహార కొరత నివారించి, ఆహార సమృద్ధి పెంపొందించడంలో హరిత విప్లవ పాత్రను వివరించారు. చిరుధాన్యాల ప్రాధాన్యత మరింత పెరగాలన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ ఎ.స్వరూపరాణి, సదస్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌ఎం జబీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వివాహిత మృతి

అమరాపురం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం మండలం హేమావతికి చెందిన సంజీవమ్మ కుమార్తె రుద్రమ్మ (30)కు 15 సంవత్సరాల క్రితం పావగడ తాలూకా సీకే పురం గ్రామానికి చెందిన హనుమంతుతో వివాహమైంది. అయితే పక్షవాతం వల్ల ఎడమ చెయ్యి సక్రమంగా పనిచేయకపోవడంతో రుద్రమ్మ పుట్టింట్లోనే ఉంటోంది. భర్త అప్పుడప్పుడు వచ్చి పలకరించి వెళ్లేవాడు. ఇటీవల మూర్ఛ వ్యాధితోనూ ఆమె బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం దుస్తులు శుభ్రం చేసేందుకు గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లిన ఆమె... అక్కడ మూర్ఛరావడంతో చెరువులో పడిపోయింది. అటుగా వెళుతున్న వారు ఈ విషయాన్ని గమనించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గల్లంతైన రుద్రమ్మను గాలించి వెలికి తీసేలోపు ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వలంటీర్ మృతి


మధుసూదన్ (ఫైల్)

ముదిగుబ్బ: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లికి చెందిన తొండూరు మధుసూదన్(33)కు భార్య లక్ష్మీదేవి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. పాడి పోషణతో పాటు గ్రామ వలంటీర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఆరు గంటలకు తన ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్డులో ఆవు పాలు పితుకుతుండగా అది కాలితో తన్నింది. దీంతో మధుసూదన్ రేకుల షెడ్‌కు ఏర్పాటు చేసిన ఇనుప పైపునకు తగిలాడు. పైపునకు అమర్చిన స్విచ్‌బోర్డు నుంచి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వంశీకృష్ణ తెలిపారు. కాగా, వలంటీర్ మధుసూదన్ మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరులు వెంకటకృష్ణారెడ్డి... నేరుగా ఆ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

గుత్తి రూరల్: స్థానిక పెండేకల్లు రైలు మార్గంలో బసినేపల్లి తండా వద్ద రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని ఆదివారం అర్ధరాత్రి రైల్వే కీమెన్ గుర్తించి, సమాచారం అందించడంతో సోమవారం ఉదయం రైల్వే ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వినతి


ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని పీఆర్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో ఎమ్మెల్సీని ఉమ్మడి అనంతపురం జిల్లా పీఆర్టీయూ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కలసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించిన అన్ని సమస్యలనూ పరిష్కరించేలా చూడాలని విన్నవించారు. నూతన పీఆర్సీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని, పాఠశాలల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లించేలా చూడాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న హిందూపురం డివిజన్ ఉప సంచాలకులు పెంచలయ్య

పరిగి: గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం పరిగి పశువైద్యశాల వైద్యాధికారి సోమనాథ్ అధ్యక్షతన గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై పాడి రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ గొర్రెల మందలో మంచి విత్తన పొట్టేలు గొర్రె ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యాధుల బారిన పడిన గొర్రెలను మందకు దూరంగా ఉంచాలన్నారు. అలాగే గొర్రెలకు పాకలు ఏర్పాటు చేసి, శ్రేష్టమైన మేపు పశుగ్రాసం అందుబాటులో ఉంచాలన్నారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సుబ్బరాయుడు, చైతన్య కుమార్, దీపిక, రాధిక, జానకి, ఖలందర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వృద్ధుడి దుర్మరణం


మృతుడు నరసప్ప

రొళ్ల: వెనుక నుంచి వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం హొట్టేబెట్ట గ్రామానికి చెందిన నరసప్ప (65) సోమవారం ఉదయం తన పొలం వద్దకు నడుచుకుంటూ వెళుతుండగా రొళ్ల వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన మినీ లారీ ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రొళ్ల ఎస్‌ఐ మధు రామచంద్రుడు, పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ప్రమాదానికి కారణమైన మినీ లారీ డ్రైవర్ సంజీవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మినీ లారీ డ్రైవర్ సంజీవరెడ్డి స్వగ్రామం అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి. మినీ లారీని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బాడుగ నిమిత్తం కర్ణాటకలోని మంగళూరుకు వెళ్లిన ఆయన అక్కడ సరుకు అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. హొట్టేబెట్ట వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక నరసప్పను ఢీకొన్నట్లుగా తెలిసింది. మృతుడికి భార్య నాగలక్ష్మమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ధర్మవరం చీర అద్భుతం!

- నేతన్నల పనితనానికి ముగ్ధుడైన ‘ఇన్వెస్ట్ ఇండియా’ ప్రతినిధి హరిప్రీత్‌సింగ్
- ‘వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాజెక్ట్’కు ధర్మవరం ఎంపికపై హర్షం



మాట్లాడుతున్న ఇన్వెస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధి హరిప్రీత్‌సింగ్, ప్రదర్శనను తిలకిస్తున్న ప్రముఖులు

ధర్మవరం: ఆధునిక డిజైన్, ఆశ్చర్యచకితులను చేసే నేతన్నల పనితనంతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ధర్మవరం పట్టుచీరను చూసి ఇన్వెస్ట్ ఇండియా సంస్థ ప్రతినిధి హరిప్రీత్‌సింగ్ ముగ్ధుడయ్యారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చేనేత కార్మికులు, పట్టు వ్యాపారులు, మాస్టర్ వీవర్స్‌తో సమావేశమైన ఆయన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పట్టుచీరల ప్రదర్శనను తిలకించారు. ప్రదర్శనలో 13 భాషల్లో నేసిన శ్రీరామ కోటి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటం, శ్రీకృష్ణుడు గోపిక 3డీ చీర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో నేసిన పట్టుచీరలను చూసి ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా ధర్మవరం నేతన్నల పనితనాన్ని పొగిడారు. అనంతరం చేనేత పట్టుచీరల ఉత్పత్తి కేంద్రాలైన డైయింగ్ యూనిట్, చేనేత మగ్గాలు, రంగుల అద్దకం, డిజైనింగ్, పట్టుచీర తయారు చేసే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా హరిప్రీత్ సింగ్ మాట్లాడుతూ... వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాజెక్టు పథకం కింద ధర్మవరం పట్టుచీర ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా ధర్మవరానికి మంచి గుర్తింపు, స్థానం ఉందన్నారు. పట్టుచీరల ప్రదర్శన తనను ఎంతగానో ఆకట్టుకుందని, వీటి నివేదికలను కేంద్రానికి పంపిస్తానని తెలిపారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాజెక్టుతో ధర్మవరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ ఏడీ రమేష్, అప్పాజి, డీఓలు రమణారెడ్డి, విజయానంద్, ఏడీఓలు శీనానాయక్, ఈశ్వరయ్య, డిజైనర్ నాగరాజు, చేనేత కార్మికులు, పట్టు వ్యాపారులు, మాస్టర్ వీవర్స్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆముదం’ తిని గొర్రెలు మృతి



రాయదుర్గం రూరల్: ఆముదం పంట ఇగురు తిన్న పది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రాయదుర్గం మండలం ఆర్‌బీ వంక (బొందనకల్లు) గొల్లలదొడ్లలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాపర్లు గొల్ల తిప్పేస్వామి, గొల్ల రుద్రన్న తమ జీవాలను సోమవారం ఉదయం మేపునకు అటవీ శివారు ప్రాంతానికి తోలుకెళ్లారు. మార్గమధ్యంలో ఆముదం పంటలోకి చొరబడిన గొర్రెలను అదలించుకుని వచ్చే లోపు ఇగురు తిన్నాయి. కాసేపటి తర్వాత పది గొర్రెలు మృతి చెందగా మరి కొన్ని అస్వస్థతకు లోనయ్యాయి. పశువైద్య సిబ్బంది అక్కడకు చేరుకుని చికిత్స చేయడంతో అస్వస్థతకు లోనైన గొర్రెలు కోలుకున్నాయి.